ప్రజాశక్తి
సోమవారం 19 ఆగస్టు 2024
5
విజయనగరం

వెనుదిరిగిన గజరాజులు

మన్యం జిల్లాలోకి వెళ్లిపోతున్న గజరాజులు

ప్రజాశక్తి-వంగర

ఈ నెల 11న వంగర మండలంలోని వివిఆర్‌పేటలోకి ప్రవేశించి, పంటలను నాశనం చేసి, రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేసిన గజరాజులు ఆదివారం పార్వతీపురం మన్యం జిల్లా గరుగుబిల్లి మండలంలోకి ప్రవేశించాయి. దీంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. వారం రోజుల పాటు ఇక్కడ తిష్టవేసిన ఏనుగుల గుంపు వివిఆర్‌పేట, రాజుల గుమ్మడ గ్రామాల్లో మొక్కజొన్న, చెరకు, పామాయిల్, వరి పంటలను ధ్వంసం చేశాయి. అధికారులు పంట నష్టాన్ని పరిశీలించి, నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

కౌలురైతులకు అందని రుణాలు

జిల్లాలోని కౌలురైతులు బ్యాంకు రుణాలకు నోచుకోలేదు. నిబంధనల పేరిట బ్యాంకర్లు మోకాలడ్డటంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. కౌలురైతుల గుర్తింపే అరకొర అనుకుంటే, గుర్తించిన కౌలుదారుల్లో 10 శాతం మందికి కూడా రుణాలు ఇవ్వలేదు. మరోవైపు పంటల మదుపుకోసం కౌలురైతులంతా ప్రయివేటు వడ్డీ వ్యాపారుల చుట్టూ తిరుగుతున్నారు.

- నిబంధనల పేరిట మోకాలడ్డుతున్న బ్యాంకర్లు
- 15 వేల మందికి గాను 583 మందికి మాత్రమే రుణాలు
- అప్పల కోసం రైతుల తిప్పలు



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో దేవాదాయ శాఖ, మాన్సాస్ ట్రస్ట్, కాస్త పెద్దరైతుల వద్ద భూములు లీజుకు తీసుకుని సాగుచేస్తున్నవారు సుమారు 60 వేలకుపైగా ఉంటారని అంచనా. కానీ, ప్రభుత్వం మాత్రం ఏటా 16వేల మందికి మించి గుర్తించడం లేదు. ఈ ఏడాది 15,550 మందికి సిసిఆర్‌సి (క్రాప్ కల్టివేషన్ కార్డు)లు ఇవ్వాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. వీరిలో ఇప్పటి వరకు 14,709 మందికి కార్డులు జారీచేసినట్టు రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. వీరందరికీ రూ.70 కోట్ల మేర వ్యవసాయ రుణాలు ఇవ్వాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నేతృత్వంలో ఇటీవల జరిగిన బ్యాంకర్లు, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు, ప్రజాప్రతినిధుల సమావేశం నిర్ణయించింది. ఆచరణ పరిశీలిస్తే.... పంచపాండవులు ఎంతమంది అంటే మంచం కోళ్ల మాదిరిగా మూడేనంటూ రెండు వేళ్లు చూపించి, అందులో ఒకటి మూసేసిన చందంగా ఉంది. అసలు కౌలురైతుల గుర్తింపు కోసం లక్ష్యమే తక్కువగా ఉందని రైతుసంఘం నాయకులు గగ్గోలు పెడుతుంటే, అధికారులు తీసుకున్న లక్ష్యానికి అనుగుణంగా కార్డులు కూడా జారీచేయని పరిస్థితి. 14,709 మందికి కార్డులు జారీచేయగా కేవలం 583 మందికి రూ.3.54 కోట్లు మాత్రమే ఇప్పటి వరకు రుణాలు ఇచ్చారు. కౌలురైతులందరికీ సకాలంలో రుణాలు ఇవ్వాలంటూ కలెక్టర్ మొదలుకుని ప్రజాప్రతినిధులు కూడా ఆదేశాలు జారీచేసినప్పటికీ ఆచరణకు నోచుకోలేదు. ఇందుకు కారణం లేకపోలేదు. రైతుల రుణసాయానికి ప్రపంచ బ్యాంకు అనేక షరతులు విధించింది. అందులోనూ కౌలురైతులకు ఇవ్వాలంటే సంబంధిత భూ యజమానుల నుంచి నిరభ్యంతర సర్టిఫికెట్ సమర్పించాలని మెలిక పెట్టింది. ఆ విధంగా ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేందుకు చాలామంది భూ యజమానులు ముందుకు రావడం లేదు.

చాలామంది పెద్ద రైతులు కూడా కొంత భూమిని సాగుచేసుకుంటూ మొత్తం భూమిపై వారే రుణాలు తీసుకోవడం మరో కారణం. ఆయా సందర్భాల్లో సంబంధిత సర్వే నంబర్లను బ్యాంకర్లు రౌండప్ చేసిన తరువాత భూయజమాని నిరభ్యంతర పత్రాలు ఇచ్చినప్పటికీ సహజంగానే అవి బ్యాంకుల్లో చెల్లుబాటు కావు. ఇందుకోసం బ్యాంకు నిబంధనలు సడలించడం తప్ప మరో మార్గం లేదని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. కౌలు రైతులపై ప్రేమాభిమానాలు ఉంటే, జిల్లాకు చెందిన ఉన్నతాధికారులు, మంత్రి, ప్రజాప్రతినిధులు ఈ విధమైన ఒత్తిడి ప్రభుత్వంపై పెంచాల్సిన అవసరం ఉందని చాలా మంది వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటి కేవలం 1,53,446 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. ఈ ఏడాది వరి సాధారణ విస్తీర్ణం 2,22,538 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 1,15,184 ఎకరాల్లో నాట్లు పడినట్టు అధికారులు చెప్తున్నారు. ట్రాక్టర్ అద్దెలు, ఎరువుల ధరలు ఎప్పటి మాదిరిగానే ఈ ఏడాది కూడా పెరిగాయి. ఈనేపథ్యంలో వ్యవసాయ పెట్టుబడుల కోసం కౌలు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు.

ముగిసిన తైక్వాండో పోటీలు

విజేతగా తూర్పుగోదావరి జిల్లా

విజేత జట్టుకు ఛాంపియన్‌షిప్ ట్రోఫీని అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరంలోని రాజీవ్ స్టేడియంలో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఈ పోటీలను విజయనగరం జిల్లా తైక్వాండో అసోసియేషన్ నిర్వహించింది. రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి వేణుగోపాల్‌రావు, ఒలింపిక్ సంఘం అధ్యక్షులు గురాన అయ్యలు చేతుల మీదుగా ఛాంపియన్ షిప్ ట్రోఫీలు అందించారు. ఈ ఛాంపియన్‌షిప్ విజేతగా తూర్పు గోదావరి జిల్లా, రెండో స్థానంలో విశాఖపట్నం, మూడో స్థానంలో కడప జిల్లా నిలిచాయని ఆర్గనైజర్ సిహెచ్.వేణుగోపాల్‌రావు తెలిపారు. ఈ పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు హాజరైనట్లు చెప్పారు. బంగారు పతకం సాధించిన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

గంజాయి నిర్మూలనకు వంద రోజుల కార్యాచరణ

డిఐజి గోపినాథ్

ఎస్‌పిలతో సమావేశమైన డిఐజి గోపినాథ్

ప్రజాశక్తి-విజయనగరం కోట

విశాఖపట్నం రేంజ్ పరిధిలోని ఐదు జిల్లాల్లో గంజాయి నిర్మూలనకు వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలుకు చేస్తున్నట్లు డిఐజి గోపినాథ్ జట్టి తెలిపారు. విశాఖ రేంజ్ పోలీసు కార్యాలయంలో ఐదు జిల్లాల్లోని ఎస్‌పిలతో డిఐజి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు రేంజ్ పరిధిలో జిల్లా ఎస్‌పిలు గంజాయి నియంత్రణకు చేపట్టిన చర్యలు, పురోగతి, పరిణామాలు, భవిష్యత్తులో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. గంజాయి అక్రమ రవాణాకు వినియోగిస్తున్న అన్ని మార్గాలపై నిఘా కొనసాగించాలని, కీలక నేరస్తులపై అనుమానిత షీట్లు తెరవాలని డిఐజి సూచించారు. ఈ ఏడాదిలో రూ.4.75 కోట్ల విలువ చేసిన 9,517 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని, 545 మందిపై 223 కేసులు నమోదు చేశామని తెలిపారు. గంజాయి రవాణాకు సహకరించిన వారిని కూడా ఆయా కేసుల్లో నిందితులుగా చేర్చి, అరెస్టులు చేయాలని ఎస్‌పిలను ఆదేశించారు. ఈ సమావేశంలో విజయనగరం ఎస్‌పి వకుల్ జిందాల్, అనకాపల్లి ఎస్‌పి దీపిక, శ్రీకాకుళం ఎస్‌పి మహేశ్వర రెడ్డి, పార్వతీపురం మన్యం ఎస్‌పి మాధవ్ రెడ్డి, అల్లూరి సీతారామరాజు ఎస్‌పి అమిత్ బర్దర్, ఎన్‌డిపిఎస్. పబ్లిక్ ప్రాసిక్యూటర్ గోవిందరావు పాల్గొన్నారు.

కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలోకి చేరిన వర్షపునీరు

నగరంలో కుండపోత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో ఆదివారం సాయంత్రం భారీవర్షం కురిసింది. గంటపాటు కురిసిన వర్షానికి రోడ్లన్నీ చెరువును తలపించాయి. నగర పాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలోకి నీరు అధికంగా చేరి చెరువులా మారింది. భారీగా నీరు చేరడంతో కార్యాలయం బయట ఉన్న వాహనాలు నీటిలో మునిగిపోయాయి. నగరంలో రోడ్లు జలమయం అయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు భారీగా చేరింది. కాలువల వ్యవస్థ డొల్లతనం ఈ వర్షానికి బయట పడింది. నగరంలో ఎటు చూసినా చిన్న కాలువలు కావడం, ఉన్న పెద్ద కాలువల్లో చెత్త, డబ్రీస్ ఎక్కువగా ఉండటంతో రోడ్డుపైకి వర్షపునీరంతా చేరింది.

జిల్లాకు వాలీబాల్ కిట్లు

విజయనగరం టౌన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వాలీబాల్ సంఘం రాష్ట్రంలోని అన్ని జిల్లా సంఘాలకు వాలీబాల్స్, నెట్స్, బీచ్ వాలీబాల్స్ అందించింది. ఇందులో భాగంగా వాలీబాల్ క్రీడాభివృద్ధికి విజయనగరం జిల్లాకు కూడా వాలీబాల్స్, నెట్స్, బీచ్ వాలీబాల్స్ అందజేసింది. జిల్లా వాలీబాల్ సంఘం అధ్యక్షులు గవర సూరిబాబు, కార్యదర్శి కెవిఎఎన్ రాజు(చిన్నారి) రాష్ట్ర వాలీబాల్ సంఘానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో వాలీబాల్ అభివృద్ధికి విశేష కృషి చేసిన సహాయ కార్యదర్శి కె.కృష్ణంరాజుకు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్.వెంకటేశ్వర రావు ద్వారా వాలీబాల్ మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో విజయనగరం జిల్లా ఒలింపిక్ సంఘం సెక్రటరీ సిహెచ్.వేణుగోపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జూనియర్ డాక్టర్ హత్య కేసులో నిందితులను ఉరి తీయాల్సిందే

- పలు చోట్ల నిరసనలు

ప్రజాశక్తి-బొబ్బిలి

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను పట్టుకుని ఉరిశిక్ష వేయాలని సిపిఎం మండల కార్యదర్శి ఎస్.గోపాలం, సిఐటియు నాయకులు సురేష్ డిమాండ్ చేశారు. ఈ ఘటనకు వ్యతిరేకంగా ఆదివారం పట్టణంలోని పాకీవీధిలో అంబేద్కర్ విగ్రహం వద్ద మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు రక్షణ లేదన్నారు. మహిళలపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు, దాడులు పెరుగుతున్నా నిందితులపై కఠిన చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజల ప్రాణాలను కాపాడుతున్న వైద్యురాలిని హత్యాచారం చేయడం దుర్మార్గమన్నారు.

గజపతినగరంలో ర్యాలీ చేపడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, విద్యార్థులు

బొబ్బిలిలో మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న సిపిఎం, సిఐటియు నాయకులు, కార్మికులు

మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్‌చేశారు. వైద్యురాలిపై హత్యాచారం చేసిన నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు గౌరీష్, వాసు, కార్మికులు పాల్గొన్నారు.

గజపతినగరం : కోల్‌కతా ఘటనకు వ్యతిరేకంగా గజపతినగరంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన ర్యాలీ నిర్వహించారు.

కఠినంగా శిక్షించాలి

విజయనగరం టౌన్ : కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారయత్నానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని వక్తలు డిమాండ్ చేశారు. ఈ ఘటనకు నిరసనగా ఆదివారం విజయనగరంలో జనవిజ్ఞాన వేదిక సమతా విభాగం ఆధ్వర్యాన రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటుచేశారు. సమతా రాష్ట్ర కన్వీనర్ జి.నిర్మల అధ్యక్షతన జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఐఎంఎ మహిళా నాయకులు డాక్టర్ సన్యాసమ్మ మాట్లాడారు. జూనియర్ డాక్టరుపై అత్యాచారం, హత్య ఘటనను తీవ్రంగా ఖండించారు. న్యాయం జరిగే వరకూ పోరాడతామని తెలిపారు. దీంతోపాటు దేశంలో ఇటీవల కాలంలో వివిధ సందర్భాల్లో డాక్టర్లపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. వైద్యులపై భౌతిక దాడుల నివారణకు చట్టం తేవాలని డిమాండ్ చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. అందుకు ఉపాధ్యాయులు మరింత బాధ్యత తీసుకోవాలని కోరారు. సమాజం పట్ల అవగాహన పెంపొందించేలా కృషి చేయాలని విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా గౌరవాధ్యక్షులు వి.లక్ష్మి, నాయకులు కరుణ, జెవివి జిల్లా అధ్యక్షులు ఎంవిఎన్ వెంకటరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజగోపాల్, నాయకులు రమేష్‌రాజా, సాహితి స్రవంతి నాయకులు చీకటి దివాకర్, చంద్రిక రాణీ, మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులు భగవాన్, ముస్లిం మహిళా నాయకులు శభాన, నర్స్ యూనియన్ నాయకులు వసంత, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆర్.ఆనంద్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి హరీశ్, సిఐటియు నగర ఉపాధ్యక్షులు ఎ.జగన్‌మోహన్, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఐఎంఎ మహిళా నాయకులు సన్యాసమ్మ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే బాధ్యత

విజయనగరం టౌన్ : జూనియర్ డాక్టర్ హత్య, హత్యాచారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నైతిక బాధ్యత వహించాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుధారాణి డిమాండ్ చేశారు. స్థానిక ఎన్‌పిఆర్ శ్రామిక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జూనియర్ డాక్టర్‌ను మానవ మృగాళ్లు సామూహిక అత్యాచారం చేసి, అతి కిరాతకంగా హత్య చేశారన్నారు. ఒకరిపై కేసు నమోదు చేసి, ప్రిన్సిపల్‌కు వేరేచోట వెంటనే పోస్టింగ్ ఇచ్చారని తెలిపారు. బెంగాల్ ప్రభుత్వం ఆధారాలు తారుమారు చేసే పనిలో ఉన్నట్లు అనుమానం వ్యక్తమవుతోందన్నారు. ఈ ఘటనపై సిబిఐ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు వేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు నగర అధ్యక్షులు ఎ.జగన్‌మోహన్ రావు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు అప్పయ్యమ్మ, చంద్రకళ, రాధ, శ్యామల, నారాయణమ్మ, కనక మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎంవిఐ ఉల్లంఘనలపై కొరడా

- నగరంలో ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్
- 104 కేసులు నమోదు : ఎస్‌పి వకుల్

ప్రజాశక్తి-విజయనగరంకోట

నగరంలో మోటారు వాహన చట్టం ఉల్లంఘించిన వాహనదారులపై ట్రాఫిక్ పోలీసులు ఆదివారం ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లుగా ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా ట్రాఫిక్ సిఐ సూరినాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐలు శంబాన రవి, లోవరాజు, ఎ.మహేశ్వరరాజు, త్రినాథరావు బృందాలుగా ఏర్పడ్డారు. నగరంలోని గంటస్తంభం, ఆర్‌టిసి కాంప్లెక్స్, మూడు లాంతర్లు, కోట జంక్షన్, ఐస్ ఫ్యాక్టరీ జంక్షన్, దాసన్నపేట రైతు బజారు, కొత్తపేట నీళ్ల ట్యాంకు ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా మైనరు డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, సౌండ్ పొల్యూషన్‌కు కారకులైన వాహనదారులపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. వీటితోపాటు నంబరు ప్లేట్ లేని, క్లారిటీ లేని నంబరు ప్లేట్ల వాహనాలపై కూడా ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహన తయారీలోని సైలెన్సర్‌లో మార్పులు చేసి, శబ్ద కాలుష్యానికి పాల్పడడం తీవ్రమైన నేరమని వాహనదారులను హెచ్చరించారు. అటువంటి వాహనాల్ని గుర్తించి, సీజ్ చేసి, తదుపరి చర్యలు నిమిత్తం ట్రాఫిక్ పోలీసు స్టేషనుకు తరలించారు. మైనర్లకు, వారి తల్లిదండ్రులకు, వారికి వాహనాలు ఇచ్చిన వాహన యజమానులకు ట్రాఫిక్ పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా 104 మోటారు సైకిళ్లు సీజ్ చేశామని, వీటిలో ట్రిపుల్ రైడింగ్-23 కేసులు, మైనరు డ్రైవింగ్ -41, సౌండ్ పొల్యూషన్-17, ఇర్రెగ్యులర్ నంబరు ప్లేట్స్ వాహనాలపై 12, నో నంబరు ప్లేట్స్ కలిగిన వాహనాలపై 11, డ్రంకన్ డ్రైవ్ చేసిన వారిపై 3 కేసులు, ఎంవి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై 23 ఇ-చలానాలను ట్రాఫిక్ పోలీసులు విధించినట్లుగా ఎస్‌పి వివరించారు.

ఆకస్మిక వాహన తనిఖీలు చేపడుతున్న ట్రాఫిక్ పోలీసులు

బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ల జాడేది?

- పెరుగుతున్న ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ పేరులోనే భవనాలు తనిఖీ చేసే ఉద్యోగి అని అర్థం దాగి ఉంది. విజయనగరం నగరపాలక సంస్థలో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారంటే, ఎవరు అనేది తెలుసుకోవడం కష్టంగా మారింది. కార్పొరేషన్ పరిధిలో భవన నిర్మాణాలు, ఆక్రమణలు వంటివి పరిశీలించడం, నగర పాలక సంస్థ ఆస్తులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా చూడటం బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు బాధ్యత. నిరంతరం నగరంలో పర్యటిస్తూ, మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన స్థలాలు, భూములు విషయంలో, అక్రమ భవన నిర్మాణాలు, అక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన బాధ్యత వారిపై ఉంది. నగరంలో నలుగురు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు ఉండాల్సి ఉంది. అయితే ఉన్నారో, లేదో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.

నగరంలో గత ప్రభుత్వ హయాంలో ఇష్టారాజ్యంగా ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు జరిగినట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు కూడా ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వస్తున్నాయి. ఇంత జరుగుతుంటే వాటిని ఎప్పటికప్పుడు కట్టడి చేయడం, ఉన్నతాధికారులకు సమాచారం అందించడం బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు చేయాలి. అటువంటి పని చేసినట్లు ఎక్కడా కనిపించడం లేదు. ఎవరు అధికారంలో ఉంటే వారికి అనుకూలంగా బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు ఉండటం వల్ల ఇటువంటి ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు పెరిగినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి పాలనలో ఇప్పటికీ అనేక ఆక్రమణలపై అధికారులు చర్యలు తీసుకున్నారు. వాస్తవంగా బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు చేయాల్సిన పని చేసి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదనే చర్చ సాగుతోంది.

విజయనగరం కార్పొరేషన్ కార్యాలయం

విజయనగరం నగరపాలక సంస్థలో ప్రస్తుతం ఉన్న నలుగురు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు సచివాలయ కార్యదర్శులకు బాధ్యత అప్పగించినట్లు తెలుస్తోంది. ఒక్కొక్క బిల్డింగ్ ఇన్‌స్పెక్టరు వారి పరిధిలో ఉన్న 10 నుంచి 12 సచివాలయాలపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలి. అయితే ఉన్న నలుగురు కూడా ఎక్కడ ఉంటున్నారో, ఏమి చేస్తున్నారో కూడా తెలియని పరిస్థితి. ఏదో ఒక సచివాలయంలో ఉండి కాలక్షేపం చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. వీరిపైనా అధికారుల పర్యవేక్షణ కూడా తక్కువగా ఉండటం వల్ల ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

నగరంలో 58 సచివాలయాలు ఉన్నాయి. ప్రతి సచివాలయంలో ప్లానింగ్ కార్యదర్శి ఉన్నారు. నగరంలో ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు పెరిగిపోతుంటే వీళ్లంతా ఏమి చేస్తున్నారు? అనే ప్రశ్న తలెత్తుతోంది. ఇప్పటికైనా పాలకులు, నగర పాలక సంస్థ అధికారులు స్పందించి, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ల పనితీరుపై, అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

జూనియర్ డాక్టర్ హత్యకు జెవివి ఖండన

ప్రజాశక్తి-విజయనగరం

జూనియర్ వైద్యురాలిపై హత్యాచారం, హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని జన విజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షులు స్వరాజ్యలక్ష్మి, కార్యదర్శి ఎంవిఆర్ కృష్ణాజీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటనను వారు తీవ్రంగా ఖండించారు. దేశంలో కుల, మతాలతో గానీ, వయసుతో గానీ సంబంధం లేకుండా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలకు కారణం పురుషాధిక్య భావజాలమని పేర్కొన్నారు. మహిళలపై సమాజంలో ఉండే చిన్న చూపు, వివక్షతను రూపుమాపాలంటే శాస్త్రీయ అవగాహనను విద్యార్థులలో చిన్నప్పటి నుంచే పెంచడం, సమభావాన్ని పంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. వరుసగా జరుగుతున్న అత్యాచారాల విషయంలో మేధావులు, విద్యార్థులు ఐక్యంగా కదిలి, వాటి నియంత్రణకు పటిష్ట చర్యలు ప్రభుత్వం తీసుకునేంత వరకు పోరాడాలని పిలుపునిచ్చారు.

పేద విద్యార్థికి ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పేద ఇంటర్ విద్యార్థి పూసర్ల మనోజ్ కుమార్‌కు ఫీజు, పుస్తకాలు, దుస్తుల నిమిత్తం రూ.31 వేలను ఆర్యవైశ్య మిత్రుల చారిటీ గ్రూప్ అందజేసింది. ఆదివారం నగరంలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఏర్పాటుచేసిన జిల్లా ఆర్యవైశ్య మిత్రుల చారిటీ గ్రూప్ సమావేశంలో ఈ సాయం చేశారు. దాతల సహకారంతో విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు జిల్లా ఆర్యవైశ్య మిత్రుల చారిటీ గ్రూప్ అధ్యక్షులు ఆలవెల్లి శేఖర్, కార్యదర్శి డిమ్స్ రాజు తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి సముద్రాల నాగరాజు, మాచర్ల చంద్రశేఖర్ గుప్తా, కాపుగంటి రవి, పెంటపాటి కామరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. జిల్లా చిరంజీవి యువత, అంజనీ పుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్, అంజనీ పుత్ర చిరంజీవి బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం కామాక్షినగర్‌లోని ఎల్ఎస్ఒ హోంలో ఉన్న విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు, పౌష్టికాహారాన్ని అందించారు. కార్యక్రమంలో జిల్లా చిరంజీవి యువత అధ్యక్షులు త్యాడ రామకృష్ణారావు (బాలు), జనసేన యువ నాయకులు లోపింటి కళ్యాణ్, కోట్ల సత్యనారాయణ, కర్రోతు శేఖర్, గణేష్ పాల్గొన్నారు.

పోలీసుల చర్యపై సిపిఎం ఆగ్రహం

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

ప్రజా సమస్యలపై పోరాడే వారికి ఎలాంటి నిర్బంధాలు ఉండవని మంత్రి నారా లోకేష్ ప్రకటించినప్పటికీ పోలీసులు పాత పద్ధతుల్ని అనుసరించడాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు ఆగ్రహం వ్యక్తం చేశారు. గరుగుబిల్లి మండలం శివ్వాంలో దళితులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, భూ సమస్యలు పరిష్కరించాలని 34 రోజులుగా కలెక్టరేట్ వద్ద రిలేనిరాహార దీక్షలు చేస్తున్నప్పటికీ అధికారులు నేటికీ స్పందించలేదన్నారు. ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలనే ఉద్దేశంతో సోమవారం చలో కలెక్టరేట్ కార్యక్రమానికి పిలుపునిస్తే, దీన్ని భగ్నం చేయాలని సిపిఎం, ప్రజాసంఘాల నాయకులకు ముందస్తు నోటీసులు ఇవ్వడం దారుణమని అన్నారు. పోలీసులు ప్రజా సమస్యలపై పోరాడే వారిపట్ల ఇలా నిర్బంధాల విధిస్తే ఊరుకునేది లేదని, కచ్చితంగా సోమవారం చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించి తీరుతామని స్పష్టం చేశారు.

ఈ ఇసుక ఎక్కడికి?

ప్రజాశక్తి - పాలకొండ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత ఇసుక విధానం అమల్లోకి తెచ్చారు. ఇసుక అనాధికారంగా ఎవరు తవ్వినా చర్యలు తప్పవని ఉన్నత స్థాయి అధికారులు నుండే ఆదేశాలు వచ్చాయి. అయితే మండలంలోని గోపాలపురం, చిన్న మంగళాపురం, అన్నవరం ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు జరిగాయి. దీన్నిఈ ప్రభుత్వం వచ్చాక అడ్డుకట్టు వేశారు. అయితే అంపిలి, గోపాలపురం గ్రామాల నుండి నాటుబళ్లతో ఇసుకను జగన్నాథ స్వామి ఆలయం దగ్గరకు తరలించి పెద్దఎత్తున డంప్ చేస్తున్నారు. గత మూడు రోజుల నుండి ఇదే పరిస్థితి కనిపిస్తుంది. అయితే ఈ ఇసుక ఎక్కడికి వెళ్తుంది, ఎవరు డంప్ చేస్తున్నారనేది తెలియాల్సి ఉంది. అధికారులు ఇప్పటికైనా దీనిపై దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సాలూరు టౌన్ సిఐగా అప్పలనాయుడు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణ సిఐగా బి.అప్పలనాయుడును నియమిస్తూ డిఐజి ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ సిఐ వాసును అల్లూరి సీతారామరాజు జిల్లా ఎన్‌డిపిఎస్ టాస్క్ ఫోర్స్‌కు బదిలీ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జికెవీధి సర్కిల్ ఇన్ స్పెక్టర్‌గా ఉన్న అప్పలనాయుడును టౌన్ సిఐగా నియమించారు. ఇప్పటికే రూరల్ సిఐగా రామకృష్ణ బాధ్యతలు స్వీకరించారు.

పార్వతీపురంరూరల్ : పట్ట సిఐగా విధులు నిర్వహిస్తున్న పివివిఎస్ఎన్ కృష్ణారావు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఆయన్ను విశాఖపట్నం విఆర్‌కు పంపారు. అల్లూరి సీతారామరాజు జిల్లా డిసిఆర్‌బి సిఐగా విధులు నిర్వహిస్తున్న ఓంపురి నారాయణరావుకు పార్వతీపురం టౌన్ సిఐగా బాధ్యతలు అప్పగించారు. త్వరలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు

సీతంపేటలో కుండపోత వర్షం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో గత రెండు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఉబాలు ముమ్మరంగా ప్రారంభమయ్యాఇ. అయితే ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ కాసినప్పటికీ 6 గంటల సమయంలో ఒక్కసారిగా వాతావరణం మారి కుండపోత వర్షం కురిసింది. ఈ వర్షం రైతులకు ఎంతో అవసరం ఊరటనిచ్చింది. ఆగస్టు నెలాఖరైనప్పటికీ ఉడుపులు ప్రారంభం కాలేదు. ఈ వర్షంతో ఉడుపులు ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

పారిశుధ్య పనులు చేపట్టిన యువత

ప్రజాశక్తి - మక్కువ

యూత్ సండే సందర్భంగా హెల్పింగ్ హాండ్స్ అనే కార్యక్రమంలో భాగంగా మండలంలోని పనసభద్ర పంచాయతీ పరిధిలోని ఎర్ర సామంతవలసలో యువత పారిశుధ్య పనులు చేపట్టారు. ఆర్‌సిఎం చర్చి ఫాదర్ పువ్వల జీవన్‌బాబు, యూత్ లీడర్ రాయల అనిరుద్, గ్రామంలోని యువత అంతా కలిసి రోడ్లు, మురుగు కాలువలను, పూడిక తీసి శుభ్రం చేశారు. కార్యక్రమంలో యువత పాల్గొన్నారు.

దుకాణాల్లో రాఖీల సందడి

ప్రజాశక్తి - భామిని

మండలం లోని పలు దుకాణాల్లో రాఖీల అమ్మకాలు సందడి నెలకొంది. ప్రతీ ఏటా రాఖీపౌర్ణమి రోజు అన్న, తమ్ముళ్లుకు రాఖీలు కట్టి, అన్న దమ్ములు తమ జీవితాలకు తోడుగా నిలవాలని, ఈ అన్నదమ్ములు బంధం ఇలాగే జీవితాంతం కొనసాగాలని కోరుకుంటామని భావిస్తుంటారు. తండ్రి తర్వాత తండ్రి అయిన అన్న ఆశీర్వాదాలు తీసుకుంటామని మహిళలు తెలిపారు. ప్రస్తుతం రాఖీల ధరలు పెరిగినా అన్నదమ్ములుకు రాఖీలు కట్టడం మానమని మహిళలు తెలిపారు.

అధ్వానంగా శ్మశానవాటిక రహదారులు

ప్రజలకు తప్పని అవస్థలు

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని రెల్లివీధి, గెడ్డ కాలనీతో పాటు బొడ్లపాడు, కొట్టుగుమ్మడ, తదితర గ్రామాల్లో శ్మశానవాటికల రహదారులు అధ్వానంగా ఉండడం వల్ల బంధువులు, గ్రామస్తులు మృతదేహాలను తరలించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా రహదారులు అధ్వానంగా మారడంతో మరి ఇన్ని అవస్థలకు గురికావాల్సి వస్తుందని వాపోతున్నారు. కొట్టుగుమ్మడ బిటి రహదారి నుంచి శ్మశాన వాటికి తరలించే రహదారి చిత్త, చిత్తగా మారింది. రెండేళ్ల కిందట ఇదే గ్రామాన్ని అప్పటి కలెక్టర్ నిశాంత్ కుమార్ శ్మశాన వాటిక సమీపంలో ఉపాధి పనులు పరిశీలించేందుకు వచ్చినప్పుడు ఉపాధి కూలీలంతా శ్మశాన వాటికకు రహదారి సౌకర్యం కల్పించాలని కలెక్టర్‌ను వేడుకొన్నారు. ఉపాధి హామీ నిధులతో సీసీ రహదారి నిర్మించాలని అప్పట్లో అధికారులకు ఆదేశించినప్పటికీ ఇక్కడ ఎటువంటి అబివృద్ధి పనులు జరగలేదు. అలాగే బొడ్లపాడు గ్రామ శ్మశాన వాటిక పంట పొలాల మధ్య ఉన్నందున మృతదేహాలను తరలించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రస్తుతం పంటలు సీజన్ కావడం వల్ల గ్రామాల్లో ఎవరైనా మృతి చెందితే మృతదేహాన్ని పంట పొలాల నుంచి శ్మశానవాటికి తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి శ్మశాన వాటికకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

పాఠశాలను పునరుద్ధరించాలి

యుటిఎఫ్ బృందానికి గిరిజనుల వినతి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

తమ గ్రామంలో 3,4,5 తరగతులను పనరుద్ధరించాలని మండలంలోని చిత్రకోటబొడ్డవలస పంచాయతీ పరిధిలో గల నిమ్మలపాడు గిరిజనలు యుటిఎఫ్ బృందానికి వినతి పత్రం అందజేశారు. ఆదివారం యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె విజయ గౌరి ఆధ్వర్యంలో యుటిఎఫ్ బృందం నిమ్మల పాడు గ్రామాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా సి.హెచ్ బొడ్డవలస సర్పంచ్ వేలంగిని మాట్లాడుతూ గతంలో 5వ తరగతి వరకు పాఠశాల, గిరిజన హాస్టల్ ఉండేవని హాస్టల్‌లో 200 మంది వరకు విద్యార్థులు వుండేవారని, ప్రస్తుతం 1,2 తరగతులు మాత్రమే ఉన్నాయని, ఆపై తరగతులకు 3కిలోమీటర్లు దాటి కాలినడకన పిల్లలు తాడిలోవ పాఠశాలకు వెళ్తున్నారని చెప్పారు. పిల్లలు తిరిగి వచ్చేంత వరకు భయంతో బిక్కుబిక్కు మంటున్నామని వాపోయారు. గతంలో అనేకమార్లు అధికారులకు, ప్రజాప్రతి నిదులకు తెలియచేసామని, ఎవరూ పట్టించుకోలేదని సర్పంచ్ ఆవేదన వ్యక్తం చేశారు. యుటిఎఫ్ ద్వారా 3,4,5 తరగతులు ప్రారంభానికి కృషి చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. విజయగౌరి మాట్లాడుతూ గతంలో ఈ గ్రామంలో ఐటిడిఎ పరిధిలో 200 మందికి పైగా విద్యార్థులు చదువుకునే వారిని, హాస్టల్ మూసివేసిన తరువాత పిల్లలు సంఖ్య తగ్గి చివరకు 1,2 తరగతులకు మాత్రమే పరిమితం అయ్యే పరిస్థితులు వచ్చాయని దీంతో పిల్లలు చదువుకు దూరం అవుతున్నారని అన్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే, విద్యాశాఖాధికారులు స్పందించి 3,4,5 తరగతులు నిమ్మలపాడు గ్రామంలో పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సామాజిక కార్యకర్త కృష్ణదాసు విద్యార్థులకు బ్యాగ్‌లు, నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిల్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు నాయకులు మహేష్, శ్రీనివాస్, కృష్ణ దాసు, గిరిజనులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



యుటిఎఫ్ బృందానికి వినతి పత్రాన్నిస్తున్న గిరిజనులు

సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఉన్న రాచ వీధిలో పారిశుధ్య సమస్యలు పరిష్కరించాలని, వరద నీటిని కాలువల ద్వారా పంపించే ఏర్పాట్లు చేసేలా చర్యలు చేపట్టాలని, రోడ్లు, కాలువలు నిర్మించాలని ఆ వీధి మహిళలు ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మహిళా సంఘం నాయకులు బి.మణమ్మ, రేవతి, జె.అనసూయ, రాజేశ్వరి, ప్రశాంతి, సుశీల, జి.గౌరీ, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు నిల్వ ఉన్న నీటి వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నిత్యం చిన్నపాటి వర్షానికి నరకయాతన పడుతున్న పరిస్థితి నెలకొందని, దీనిపైన జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపకపోవడంతో తమ బతుకులు దుర్భరంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విష జ్వరాలు సోకే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. కావున అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి వెంటనే రోడ్డుతో పాటు కాలువలు నిర్మించి నీరు నిల్వ లేకుండా, ప్రజలు అనారోగ్యం పాలవ్వకుండా ఉండాలంటే దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. అలాగే కాలువ లేకపోవడం వల్ల ఆసుపత్రిలో ఉన్నటు నీరు కూడా రాచవీధి లోపలికి వచ్చి ఇళ్లల్లోకి చేరి అనారోగ్యం పాలవుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు.

సబ్ రిజిస్ట్రార్‌పై ఆరోపణలు.. వీడియో చక్కర్లు

మీడియాతో మాట్లాడుతున్న బాధిత జంట

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో గత ప్రభుత్వ హయాంలో 22ఏలో ఉన్న భూములను, అసైన్డ్ భూములను అప్పటి నాయకులు ఇష్టానుసారం రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని అందుకు ఎస్‌కోట సబ్ రిజిస్టర్ సహకరించారని ఫిర్యాదులు అందిన విషయం తెలిసిందే. దీంతో రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా పట్టణంలోని సబ్ రిజిస్టర్ కార్యాలయంలో రెండు రోజుల క్రితం తనిఖీలు నిర్వహించారు. ఇది ఎలా ఉండగా వివాహ రిజిస్ట్రేషన్లకు డబ్బులు వసూలు చేస్తున్నారంటూ ఎస్.కోట సబ్ రిజిస్టర్ పై సోషల్ మీడియాలో ఓ వీడియో ప్రస్తుతం చక్కెర్ల కొట్టడంతో చర్చనీయాంశమైంది. వివాహ ధ్రువీకరణ పత్రం పొందాలంటే మూల్యం చెల్లించకతప్పదని ఒక వివాహ జంట ఓపెన్ స్టేట్మెంట్ వీడియో, సోషల్ మీడియాలో చెక్కర్లు కొడుతుంది. జామి మండలం అన్నమరాజుపేట గ్రామానికి చెందిన ఒక వివాహ జంట ఎస్‌కోట సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌కి వచ్చారు. వివాహ ధ్రువీకరణ పత్రం కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది రూ.3వేలు అడిగారు. తాము ఇవ్వమని చెప్తే మీరే స్వతహాగా చేయించుకోమని ఎగతాలి చేసినట్లు మాట్లాడారు. దీంతో వారు ఆ రోజు వెళ్లిపోయి తిరిగి మరుసటి రోజు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చారు. మరోసారి ఆ సిబ్బంది రూ. 2వేలు ఇవ్వాలని, కుదరకపోతే రూ.1500, రూ.1000 అయినా ఇవ్వాలని అడిగారు. ఎందుకు డబ్బులు ఇవ్వాలని ఈ జంట ప్రశ్నించగా సబ్ రిజిస్ట్రార్ మేడమ్‌కు ఇవ్వాలని చెప్పారని ఈ వీడియోలో జంట చెప్పిన విషయం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. విద్యావంతులమైన తమ వద్దే ఇన్నిసార్లు లంచాలు కోసం ఇబ్బందులు పెడుతుంటే సామాన్య ప్రజలు పరిస్థితి ఏంటని, ఇటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఆ జంట మీడియా ముఖంగా ప్రభుత్వాన్ని కోరారు..

హెచ్చరిక బోర్డులు తొలగించి కబ్జా చేసిన చెరువు గర్భం..

హెచ్చరిక బోర్డులు తొలగించి ఆక్రమణ

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వావిలపాడులో నాయుడు చెరువు గర్భాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారులు గతంలో ఆక్రమించారు. దీనిపై ఆయకట్టు రైతులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయగా ఇది ప్రభుత్వ భూమిగా గుర్తించి హెచ్చరిక బోర్డు పెట్టారు. ఇప్పుడు మరోసారి అక్రమార్కులు హెచ్చరిక బోర్డును తొలగించి దర్జాగా ఆ చెరువు గర్భంలో మొక్కలు నాటుతున్నారని రైతు నాగిరెడ్డి రాజు నాయుడు తెలిపారు. రెవెన్యూ అధికారులు కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కొమ్ము కాస్తున్నారని ఆరోపిస్తున్నారు.

రక్తదానం చేస్తున్న యువత

జరజాపుపేటలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని జరజాపు పేటకు చెందిన సాధన యువజన సంఘం ఆ గ్రామంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జరజాపుపేట సాధన యువజన సంఘం అత్యవసర రక్తదాన శిబిరం నిర్వహించింది. ఈ సందర్భంగా రక్త నిల్వలు తక్కువగా ఉండటం వల్ల అత్యవసర శిబిరం ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. ఎంఆర్ డిగ్రీ కళాశాల ఎన్‌సిసి అధికారి కళ్యాణ్ అశోక్ పాల్గొని సాధన యువజన సంఘం సభ్యులను అభినం దించారు. శిబిరంలో సాధన యువజన సంఘం అధ్యక్షులు పోలుబోతు దుర్గాప్రసాద్ 63వ సారి రక్తదానం చేయడంతో బాటు మిత్రులు పది మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సాధన యువజన సంఘం ప్రధాన కార్యదర్శి పసుమర్తి వెంకటరమణ, సభ్యులు రొంగల దుర్గాప్రసాద్ 14వ సారి, మద్దిల రాంబాబు 35వ సారి రక్తదానం చేయగా శ్రీను, తాలాడ శంకరరావు, రెడ్ క్రాస్ సొసైటీ ఎపిఆర్ఒ ఎం.రాము, సిబ్బంది పాల్గొని రక్త సేకరణ చేశారు.

పలుచోట్ల భారీ వర్షం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ఆదివారం పలు చోట్ల భారీ వర్షం కురిసింది. ఉక్కబోతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు, వరి నారు వేసి నాట్లుకోసం ఎదురుచూస్తున్న రైతులకు ఈ వర్షం ఉపశమనం కలిగించింది. పలు చోట్ల రోడ్లు జలమయం కావడంతో ప్రయాణికులు అవస్థలు పడ్డారు.

శృంగవరపుకోట: ఎస్‌కోటలో ఆదివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. వరినాట్లు వేసేందుకు పూర్తిగా వరుణుడు సహకరించకపోవడంతో ఆదివారం కురిసిన వర్షం రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది ఇలా ఉండగా పట్టణంలోని శ్రీనివాస కాలనీ మురుగు కాలువలు పొంగి మురుగు నీరు రోడ్లపై ప్రవహించింది. సాయిబాబా గుడి వద్ద, రైతు బజార్, కాలేజీ గ్రౌండ్ ఎదురుగా విశాఖ అరకు రహదారిలో వర్షపునీరు రోడ్లపై ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

ఎస్‌కోట: రోడ్డుపై నిలిచిపోయిన వర్షపు నీరు

తక్కువగా హాజరైన పిల్లలు

అందని సరుకులు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ప్రభుత్వ అందజేస్తున్న సరుకులు పూర్తిస్థాయిలో అందడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. ఫలితంగా కొంత మంది పిల్లలు అంగన్‌వాడీ కేంద్రానికి కూడా రావడం లేదని తెలిస్తోంది. ఈ విషయంపై వియ్యంపేట ఐసిడిఎస్ పిఒని వివరణ కోరగా పూర్తిస్థాయిలో సరుకులు అందలేదనడంలో వాస్తవం లేదన్నారు. పప్పు, ఆయిల్ ప్యాకెట్లు మాత్రమే స్టాకు రాలేదని, అవి కూడా కొన్ని కేంద్రాలకు వచ్చాయని చెప్పారు. మిగతా స్టాకు వచ్చిన వెంటనే ఆయా కేంద్రాలకు పంపిణీ చేస్తామని చెప్పారు.

తెరుచుకోని సచివాలయం

సాలూరురూరల్: ఆంధ్రా - ఒడిస్సా వివాదాస్పద గ్రామాలకు ప్రభుత్వం ద్వారా సంక్షేమ కార్యక్రమాలను అందించాలనే ఉద్దేశ్యంతో ఎపి ప్రభుత్వం గంజాయి భద్ర పంచాయతీకి ఇక్కడ నుండి వెళ్లి రావడానికి ఉద్యోగులు ఇబ్బందులు పడతారనే కారణంతో సారిక పంచాయతీ నేరెళ్లవలసలో సచివాలయం ఏర్పాటు చేశారు. కానీ ఇక్కడ సచివాలయం సిబ్బంది మాత్రం నెలలో సగం రోజులు మాత్రమే వస్తున్నారని, మిగతా రోజులు రావడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సచివాలయానికి ఏ పనులు నిమిత్తం వచ్చినా ఏ ఒక్కరూ అందుబాటులో లేకపోవడంతో ఎంతో ఇబ్బంది పడుతున్నామని చెబుతున్నారు.

టివిఎస్ షోరూమ్ ప్రారంభం

ప్రజాశక్తి- బొబ్బిలి

పట్టణంలోని చీపురుపల్లి వీధిలో టివిఎస్ షోరూమ్‌ను ఎమ్మెల్యే బేబినాయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బేబినాయన మాట్లాడుతూ టివిఎస్ వాహనాలు ధరలు సామాన్యులకు అందుబాటులో ఉన్నాయ న్నారు. మొదటి వాహనాన్ని టిడిపి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు కొనుగోలు చేశారు. కార్యక్రమంలో టివిఎస్ షోరూమ్ ఎండి వారాణసి శ్రీహరి, డైరెక్టర్ అనురాధ, రోటరీ డిస్ట్రిక్ట్ చైర్ జెసి రాజు, అధ్యక్షులు ఎస్.శ్రీనివాస్, టిడిపి నాయకులు కె.బంగారురాజు పాల్గొన్నారు.

షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

కెజిబివిలో సీట్ల పెంపునకు ప్రతిపాదన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేట కెజిబివి వసతి గృహంలో ఒక తరగతికి 40 సీట్లు మాత్రమే ఉన్నాయి. ఈ వసతి గృహంలో విద్యా ప్రమాణాలు బాగున్నందున ప్రవేశాలకు ఎక్కువమంది విద్యార్థులు దరఖాస్తులు చేస్తున్నారు. అయితే నిబంధనలు ప్రకారమే సీట్లను కేటాయించడంతో చాలా మందికి సీట్లను సర్దుబాటు చేయలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో సామాజిక కార్యకర్త రిక్కీ అప్పారావు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి, ఈ విషయాన్ని తీసుకెళ్లారు. దీనికి స్పందించిన ఆయన వెంటనే 2024 -2025 సంవత్సరాలకు సీట్లు పెంపు కోసం అవసరమైన ప్రతిపాదనలు పంపించాలని కలెక్టర్‌కు ఆదేశాలిచ్చారు. దీంతో సీట్ల పెంపునకు ప్రతిపాదనలు పంపినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ ప్రేమ్‌కుమార్ తెలిపారు.

బొబ్బిలి సిఐగా సతీష్ కుమార్

ప్రజాశక్తి- బొబ్బిలి

సతీష్‌కుమార్

పట్టణ సిఐగా కె.సతీష్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటి వరకు పని చేసిన సిఐ ఎం.నాగేశ్వరరావును రిజర్వ్‌కు పంపించగా రిషికొండ మెరైన్ సిఐగా పని చేస్తున్న సతీష్ కుమార్ బొబ్బిలి పట్టణ సిఐగా నియమితులయ్యారు.

టౌన్ సిఐగా అశోక్ కుమార్

రాజాం: విశాఖ రేంజ్ పరిధిలో ఉన్న సీఐలను బదిలీ చేస్తూ విశాఖ రేంజ్ డిఐజి ఉత్తర్వులు జారీ చేయడంతో రాజాం టౌన్ సీఐగా ఉన్న దాడి మోహన్ రావు కాశీబుగ్గ అర్బన్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో విజయనగరం టాస్క్ ఫోర్స్ సీఐగా ఉన్న అశోక్ కుమార్‌ను రాజాం టౌన్ సీఐగా బదిలీ చేశారు.

వంగర ఎస్ఐగా శంకర్

ప్రజాశక్తి- వంగర

స్థానిక ఎస్ఐగా షేక్ శంకర్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇంతవరకు పని చేసిన ఎస్ఐ వైవి జనార్ధన్ బదిలీ కావడంతో సంతకవిటిలో పనిచేసిన ఎస్ఐ షేక్ శంకర్ బదిలీపై వచ్చి విధుల్లో చేరారు. అనంతరం లక్ష్మింపేటలో పర్యటించారు.

కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ

పది మందిపై కేసు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని బంగారు రాజుపేట గ్రామంలో స్థల వివాదంపై రెండు గ్రూపులు గొడవ పడి కొట్టుకో వడంపై పది మందిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎ. సన్యాసినాయుడు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో కాగితాల సత్యనా రాయణ, నందిక బంగారురాజుల గ్రూపుల మధ్య ఇంటి పక్కనే ఉన్న ఖాళీ స్థలంపై రెండు రోజులు క్రితం వివాదం జరిగింది. ఈ వివాదంలో బంగారురాజు కుటుంబంపై సత్యనారాయణ కుటుంబం దాడి చేసింది. వీరు ప్రభుత్వాసుపత్రిలో వైద్యం నిమిత్తం చేరారు. ఇరువురు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశాం అని చెప్పారు. ఆ రెండు గ్రూపులపై బైండ్ వర్క్ కేసులు కూడా పెట్టామని చెప్పారు. అనంతరం రెండు గ్రూపులకు పోలీసు స్టేషన్‌లో కౌన్సి లింగ్ ఇచ్చినట్లు వివరించారు. మరోసారి గ్రామంలో గొడవలు జరిగితే బెయిలు రాకుండా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో ఎటువంటి అనాధికార చర్యలు జరిగినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

వినాయక మండపానికి వెదురుకర్రలు తెస్తుండగా ప్రమాదం

ప్రజాశక్తి- బొబ్బిలి

మృతుడు చంటి

వినాయక మండపానికి వెదురు కర్రలు కొట్టి తెస్తుండగా విద్యుదాఘాతంతో యువకుడు దుర్మరణం చెందిన సంఘటన మెట్టవలసలో ఆదివారం చోటు చేసుకుంది. మండలంలోని మెట్టవలస గ్రామానికి చెందిన గడిదేశీ చంటి (20) కాకినాడలో బిటెక్ చదువుతున్నాడు. ఆర్మీ ఉద్యోగం కోసం ఒక ప్రైవేట్ అకాడమీలో శిక్షణ తీసుకునేందుకు కొన్ని రోజుల క్రితం సొంత గ్రామం వచ్చాడు. వినాయక చవితికి వినాయక మండపం సిద్ధం చేసేందుకు అదే గ్రామానికి చెందిన యువకులతో కలిసి ఎం.బూర్జవలస సమీపంలో వెదురు కర్రలు కొట్టేందుకు వెళ్లారు. వెదురు కర్రలు కొట్టి రైల్వే ట్రాక్ దాటించేందుకు చంటి వెదురు కర్రలను భుజంపై పెట్టుకుని వెళ్లగా రైల్వే ట్రాక్ వద్ద భుజంపై ఉన్న కర్రలు బేలన్స్ తప్పడంతో మొదలు కిందకు పడి కర్ర చిగురు రైల్వే హైటెన్షన్ వైర్లకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వెంటనే స్నేహితులు ద్విచక్ర వాహనంపై ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు చెప్పారు. కుమారుడు మరణించడంతో తల్లిదండ్రులు రాధ, శ్రీను, సోదరులు, కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. చంటి మృతితో మెట్టవలసలో విషాదఛాయలు అలుముకున్నాయి. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివరాలను వెల్లడిస్తున్న డిఎస్‌పి శ్రీనివాసరావు

గంజాయి రవాణా చేసిన వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి - గజపతినగరం

గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామని డిఎస్‌పి శ్రీనివాస రావు తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. శనివారం గంజాయి రవాణా జరుగుతున్నట్లు సమాచారం రావడంతో స్థానిక విఆర్ఒల సమక్షంలో వాహన తనిఖీలు చేపట్టగా నాలుగు కిలోల గంజాయి తరలిస్తున్న చతీష్ గడ్‌కు చెందిన దేవేందర్ మాంజీను అదుపులోకి తీసు కున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సిఐ జివిి రమణ, ఎస్ఐ యు.మహేష్, పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM.
I.A.No. 733/2023 in L.O.P. No. 1/2022

BETWEEN:
శ్రీకాకుళం సన్యాసప్పడు ....పిటీషనర్
AND:
ది రెవిన్యూ డివిజినల్ ఆఫీసర్, విజయనగరం మరియు నలుగురు (4) ఇతరులు .....రెస్పాండెంట్స్

నోటీసు రెస్పాండెంటె నెంబర్ 6, 7 & 8.

R6) నడిపేన నారాయణమ్మ, W/o లేటు అప్పారావు, నడిపేనవీధి, సారిపల్లి గ్రామము, నెల్లిమర్ల మండలం, విజయనగరం జిల్లా.
R7) నడిపేన రామారావు -Rest Ditto-
R8) బోనుమంతి నాగమణి, W/oశంకరరావు, థామస్‌పేట, నెల్లిమర్ల జ్యూట్‌మిల్లు దగ్గర, నెల్లిమర్ల మండలం, విజయనగరంజిల్లా.

Hg. Date:02-09-2024

పిటీషనర్ రెస్పాండెంట్స్, పైన పేర్కొన్న ల్యాండ్ అక్విజిషన్ పిటిషన్ వేసియున్నారు. సదరు పిటిషన్‌లో రెస్పాండెంట్ నెం.5 మరణించినారు. సదరు రెస్పాండెంట్ నెం.5కు లీగల్ ఎయిర్ రెస్పాండెంట్ నెం.6, 7 మరియు 8లను చేర్చినారు. సదరు పిటిషన్లో మీ యొక్క హాజరు నిమిత్తము శ్రీకోర్టువారి నుండి అనేక పర్యాయములు నోటీసులు పంపిననూ మీరు తీసుకోనందున మీకు నోటీసు నిమిత్తము శ్రీకోర్టువారి ఉత్తర్వులు ప్రకారము పై నెంబర్ కేసు తే 02-09-2024 దిన వాయిదా వున్నదని ఈ పత్రికముఖంగా తెలియపరుస్తూ సదరు తేది అనగా **తే 02-09-2024 దిన ఉదయం గం. 10.30 నిమిషాల**కు మీరు కానీ లేదా మీ తరపున వకీలు గారి ద్వారా కానీ పై కోర్టులో ప్రత్యక్షంగా హాజరు అయి మీ తరపున వాదనలు విన్నవించుకోవలెను. లేని యెడల పైన తెలిపిన కేసులో మీ పరోక్షమున విచారించి తీర్మాణించెదరని శ్రీకోర్టువారి ఉత్తర్వులు ప్రకారము ఈ ప్రకటన ద్వారా తెలియపరచడమైనది.

// BY THE ORDER OF THE HONOURABLE COURT //

ఇట్లు
B. శ్రీనివాస్ కుమార్,
పిటీషనర్ తరపున న్యాయవాది,
విజయనగరం. Cell: 77804 09899.